# గ్రేటర్ బడ్జెట్‌కు తుది మెరుగులు.. విలీన మున్సిపాలిటీలకూ చోటు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) 202627 వార్షిక బడ్జెట్ రూపకల్పన కొలిక్కి వచ్చింది. జీహెచ్ఎంసీ ఆదాయ, వ్యయాల ఆధారంగా ఈసారి అదనంగా రూ.2వేల కోట్లను పెంచి రూ.11,050 కోట్లు ఉండేలా అధికారులు నిర్ణయించారు. గతేడాది 202526 బడ్జెట్‌ను రూ.8,440 కోట్లతో రూపొందించిన విషయం తెలిసిందే. అయితే ఈసారి జీహెచ్ఎంసీలోకి 27 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయడంతో వాటికి పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ రూపొందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. అందులో భాగంగానే బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నెల 11న జరుగనున్న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో డ్రాఫ్ట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

**అధికారులతో చర్చలు..**

జీహెచ్ఎంసీ బడ్జెట్ రూపకల్పనపై అదనపు, జోనల్, డిప్యూటీ కమిషనర్లతో చర్చించాలని కమిషనర్ కర్ణన్ నిర్ణయించినట్లు తెలిసింది. అయితే జీహెచ్ఎంసీకి ఆదాయ, వ్యయాలతోపాటు 27 యూఎల్బీలకు సంబంధించిన ఆదాయం, అప్పులు, ఖర్చులు, చేపట్టాల్సిన మౌలిక వసతుల గురించి సంబంధిత డిప్యూటీ కమిషనర్లతో కమిషనర్ కర్ణన్ చర్చించనున్నారు. ఈ నేపథ్యంలోనే జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లు, చీఫ్ ఇంజినీర్లు, సిటీ ప్లానర్లు, ఎస్ఈలు వార్షిక బడ్జెట్ ఆదాయ వ్యయాల ప్రతిపాదనలను సిద్ధంచేసే పనిలో ఉన్నారు. గతంలో హెడ్ ఆఫీసు స్థాయిలోనే బడ్జెట్‌ను తయారుచేసేవారు. కానీ గతేడాది నుంచి డిప్యూటీ కమిషనర్ల నుంచి అంచనాలను అడుగుతున్నారు. జీహెచ్ఎంసీ చట్టం1955 సెక్షన్ 182 ప్రకారం వచ్చే ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ అంచనాల నివేదికను ప్రతిఏటా నవంబర్ 10లోపు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ముందు ప్రవేశపెట్టాలి. కానీ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, 27 యూఎల్బీల విలీనం నేపథ్యంలో ప్రభుత్వం నుంచి జీహెచ్ఎంసీ అనుమతి తీసుకున్నట్లు తెలిసింది.




**డ్రాఫ్ట్ బడ్జెట్ రూ. 11,050 కోట్లు..**

రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్లోనూ హైదరాబాద్ మహానగరానికి కేటాయింపులు పెరుగుతాయనీ, రెవెన్యూ రిసీట్స్, ప్రాపర్టీ ట్యాక్స్, టౌన్ ప్లానింగ్, ఎస్టేట్, పార్కుల ఆదాయాలూ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 27 విలీన యూఎల్బీల ఏరియాలో అభివృద్ధి పనులు చేపట్టడానికి బడ్జెట్‌లో ప్రతిపాదించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెవెన్యూ రిసీట్స్ రూ.4,445 కోట్లుగా ఉంటే ఈ ఏడాది రూ.5,550 కోట్లుగా ఉండొచ్చని, క్యాపిటల్ వ్యయం రూ.4000 కోట్లు ఉంటే వచ్చే ఏడాది రూ.5,500 కోట్లుగా పెరుగుతుందని అధికారుల అంచనా. హెచ్‌సిటీ ప్రాజెక్టులు కార్యరూపంలోకి రావడంతోపాటు ఎస్ఎన్డీపీ, నాలాల మాస్టర్ ప్లాన్, సీఆర్ఎంపీ, వీధిదీపాల నిర్వహణ సైతం పెరిగే అవకాశముందని చెబుతున్నారు. 2024 25లో బడ్జెట్ అంచనాలు రూ.7,937 కోట్లుగా ఉంటే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలు రూ.8,440 కోట్లకు పెరిగింది. ఈ రెండు బడ్జెట్ల వ్యత్యాసం రూ.503 కోట్లుగానే ఉంది. అయితే, వచ్చే వార్షిక బడ్జెట్ అంచనాలు రూ.11,050 కోట్ల వరకు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**ఆదాయంపై ఆశలు..**

జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరులుగా ప్రాపర్టీ ట్యాక్స్, టౌన్ ప్లానింగ్ నుంచే వచ్చేదే అధికం. అయితే ప్రాపర్టీ వసూళ్లను రూ.3వేల కోట్లకు పెంచడానికి కమిషనర్ కర్ణన్ సీరియస్‌గా ప్రయత్నిస్తున్నారు. పాత బకాయిలను వసూలు చేయడానికి 2 నెలలకు ముందుగానే ఓటీఎస్(వన్ టైం సెటిల్‌మెంట్) స్కీమ్ తీసుకురావడానికి కసరత్తు చేస్తున్నారు. అయితే జీహెచ్ఎంసీతోపాటు 27 విలీన యూఎల్బీల్లో సైతం ఆస్తి పన్ను భారీగా వసూలయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు మాల్స్, ఇతర వాణిజ్య భవనాల నుంచి ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్ ఆదాయాన్ని సైతం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు. 202526లో రూ.2,500 కోట్లతోపాటు 27 మున్సిపాలిటీల నుంచి మరో రూ.500 కోట్లు వసూలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.2వేల కోట్లకు పైగానే ఆదాయం వచ్చే అవకాశాలున్నాయని ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోనే రూ.1500 కోట్లు, 27 మున్సిపాలిటీల్లో మరో రూ.500 కోట్ల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

**ఈ నెల 11న స్టాండింగ్ కమిటీ భేటీ..**

హైదరాబాద్ మహానగర బడ్జెట్ గురించి ఈ నెల 11న జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించనున్నారు. జీహెచ్ఎంసీతోపాటు 27 యూఎల్బీ బడ్జెట్ గురించీ చర్చించనున్నారు. ఆదాయ, వ్యయాల గురించి సభ్యులు చర్చించే అవకాశముంది. ఈ బడ్జెట్ గురించి జనవరిలో నిర్వహించే జనరల్ బాడీ సమావేశంలో చర్చించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## ఆ రెండు దేశాల్లో బంధీలుగా భారత యువత: ఎంపీ అర్వింద్



**విశ్వంభర, నిజామాబాద్ :** విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసి విదేశాల్లో యువతను బంధీలుగా మార్చుతున్న గ్యాంగులను అరికట్టాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. గురువారం ఆయన పార్లమెంటులో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల నుండి ముఖ్యంగా యువతను థాయ్ లాండ్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి, నిరుద్యోగుల నుండి లక్షలాది రూపాయలు ఏజెంట్లు వసూలు చేస్తున్నారని అర్వింద్ పార్లమెంటు దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నో ఆశలతో ఉద్యోగంలో చేరేందుకు అక్కడికి వెళ్లిన వెంటనే వారి పాస్ పోర్టులను స్వాధీనం చేసుకుని హింసిస్తున్నారని అన్నారు. ఈ నేరాలకు స్థానిక మిలీషియా, సైన్యంలో కొందరు లంచాలు తీసుకుని సహకరిస్తున్నందున రక్షణ చర్యలు మరింత కష్టతరం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముఠాకు బలైన వారిలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు కూడా ఉన్నారని, వారంతా ప్రస్తుతం అక్కడే చిక్కుకుపోయి ఉన్నారని ఆయన హౌజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితిని అత్యవసరంగా పరిగణించి, ఆయా దేశాల్లో చిక్కుకున్న భారతీయ నిరుద్యోగ యువకులను రక్షించి, వారిని తిరిగి స్వదేశానికి రప్పించే చర్యలు చేపట్టాలని అర్వింద్ కోరారు.

## ఆ ఈవెంట్ మరో మైలురాయి కాబోతోంది: వల్లూరు కాంతి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** దేశంలోని ప్రముఖ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్‌లలో ఒకటైన ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ (ఐఐటీఎమ్) గురువారం హైదరాబాద్ మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది. డిసెంబర్ 4 నుండి 6 వరకు జరుగనున్నఈ కార్యక్రమం భారతీయ, అంతర్జాతీయ ప్రయాణ రంగాల విశాల సామర్థ్యాన్ని, వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి ఇది ముఖ్య వేదికగా నిలవనుంది. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల ప్రయాణ, హాస్పిటాలిటీ, ప్రభుత్వ రంగాల స్టాల్స్‌తో పాటు కొన్ని విదేశీ పర్యటక సంస్థలు కూడా స్టాల్స్ ఏర్పాటు చేసారు. ట్రావెల్ వ్యాపారాల మధ్య అనుసంధానం, పర్యటన అవకాశాల ప్రోత్సాహం ఈ రంగ అభివృద్ధికి దోహదపడే మరో మైలురాయిగా ఈ ఈవెంట్ నిలిచింది. నెట్‌వర్కింగ్, భాగస్వామ్యం, డెస్టినేషన్ ప్రమోషన్‌కు అపూర్వ అవకాశాలను అందిస్తోంది. ఈ ఎడిషన్‌లో 10 దేశాల నుండి, 25 రాష్ట్రాల నుండి 200కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా స్పియర్ ట్రావెల్ మీడియా డైరెక్టర్ సంజయ్ హాఖూ మాట్లాడుతూ.. వ్యాపారాలను అనుసంధానం చేసి, అర్థవంతమైన భాగస్వామ్యాలను ఏర్పరచడం ఐఐటీమ్ హైదరాబాద్ 2025 ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## నోటి క్యాన్సర్ నివారణకు చర్యలు చేపట్టాలి: ఎంపీ వద్దిరాజు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** బీడీ కార్మికులు నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లోని వేలాది కుటుంబాలు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వివరించారు. నోటి క్యాన్సర్ నివారణకు, ప్రజలు వ్యసనాలకు లోనుకాకుండా కేంద్ర ప్రభుత్వం అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లుపై2025 రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో గొప్పగా అభివృద్ధి చేసి దేశ ఆర్థిక పురోగతికి విశేష కృషి చేశారని అన్నారు. తెలంగాణ జనాభాలో గణనీయమైన సంఖ్యలో ఉన్న గౌడ కులస్తుల సంక్షేమంలో భాగంగా మద్యం దుకాణాల కేటాయింపుల్లో 15 శాతం ప్రత్యేక రిజర్వేషన్లను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. మద్యం అమ్మకాలకు సంబంధించి సరైన పర్యవేక్షణ, తనిఖీలు, నియంత్రణ లేని కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం బ్లాక్ మార్కెట్, కల్తీ మద్యం, బెల్ట్ షాపుల్లో విరివిగా అందుబాటులో ఉండడం, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు బాగా పెరగడంతో సామాజిక సమస్యలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. కల్తీని, అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు. కాగా.. సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతునిస్తున్నదని చెప్పారు. సామాజిక కోణంలో కాకుండా ఆర్థిక సంబంధమైన ముఖ్యమైన అంశాలతో కూడిన ఈ బిల్లుకు తమ పార్టీ మద్దతునిస్తున్నట్లు ప్రకటించారు.

## రూపకల్పన, పరంజాలపై అవగాహన

### క్షేత్ర సందర్శనలో ఆచరణాత్మక అనుభవాన్ని పొందిన గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు



**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా నిర్మాణంలో కాంక్రీటుకు కావలసిన ఆకారాన్ని ఇవ్వడానికి ఉపయోగించే ఫార్మ్ వర్క్ (రూపకల్పన), నిర్మాణ పనులలో ఎత్తులో ఉన్న ప్రదేశాలకు చేరడానికి, పనిముట్లు కార్మికులకు ఇవ్వడానికి ఉపయోగించే పరంజా ల గురించి గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు క్షేత్ర సందర్శనలో స్వీయ అనుభవాన్ని గడించారు. వాస్తవ సమయంలో ఫార్మ్ వర్క్, స్కాఫోల్డింగ్ లపై లోతైన అవగాహనను పొందారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు అమిత్ భట్టాచార్య, తపతి తపస్విత భంజా మార్గదర్శనంలో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఐదో సెమిస్టర్ విద్యార్థులకు ఈ క్షేత్ర స్థాయి సందర్శనను ఇటీవల నిర్వహించారు. ఫార్మ్ వర్క్ పద్ధతులను స్వయంగా చూడటానికి, ఇందులో ఉన్న భాగాలను అధ్యయనం చేయడంతో పాటు వాస్తవ నిర్మాణ ప్రాజెక్టులలో ఉపయోగించే పద్ధతులను అన్వేషించడానికి ఈ క్షేత్ర సందర్శన విద్యార్థులకు ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. కలప, ప్లైవుడ్, లోహంతో సహా వివిధ రకాల ఫార్మ్ వర్కులను విద్యార్థులు పరిశీలించి, నిర్దిష్ట నిర్మాణ అవసరాల ఆధారంగా వాటిని ఎలా ఎంచుకుంటారో తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవనాన్ని సందర్శించడం ద్వారా విద్యార్థులు సిద్ధాంతం, అభ్యాసం మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించగలిగారు. లోడ్ బదిలీ విధానాలు, మద్దతు వ్యవస్థలు, నిర్మాణ క్రమం వంటి కీలకమైన అంశాలపై వారి అవగాహనను మెరుగుపరచుకున్నారు. ఈ ఆచరణాత్మక అనుభవం తరగతి గది అభ్యాసాన్ని బలోపేతం చేయడమే కాకుండా, భవన నిర్మాణ పరిశ్రమకు అవసరమైన ఖచ్చితత్వం, ప్రణాళిక, సాంకేతిక నైపుణ్యం పట్ల వారి అవగాహనను మరింత పెంచింది.

## సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కాకీ ఈశ్వర్ ముదిరాజ్




**విశ్వంభర. మహేశ్వరం :** మహేశ్వరం మండలంలో నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మహేశ్వరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుండి కాకి ఈశ్వర్ ముదిరాజ్ నామినేషన్ వేయడం జరిగింది కాకి ఈశ్వర్ మాట్లాడుతూ ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన నాయకులతో కోరారు ప్రతి ఒక్కరూ ప్రచారంలో చురుగ్గా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా, దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, కాకి ఈశ్వర్ ముదిరాజ్ గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తారని, కాంగ్రెస్ పార్టీ తరపున ఆయనకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కున యాదయ్య, రఘుపతి, అల్లె కుమార్, పోతర్లతిరుపతి, జంగయ్య, లాజర్, ఏపూరి నరసింహ, హరి, మహబూబ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు

**విశ్వంభర, మక్తల్ :** మక్తల్ పట్టణం లో పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం జరిగిన రథోత్సవం ఆద్యంతం కన్నులపండువగా సాగింది. మక్తల్ శాసన సభ్యులు, రాష్ట్ర క్రీడా పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్వయంగా రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆంజనేయ స్వామి గుడి పరిసరాలాన్నీ జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మారుమ్రోగిపోయాయి. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ ప్రాంత ప్రజల ఇలవేల్పు, ఆరాధ్య దైవంఅయిన శ్రీ పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 2 నుండి అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయని, వారం రోజులపాటు జరిగే ఈ జాతరలో అనేక పూజాది క్రతువులు, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరించబోతున్నాయని మంత్రి తెలియజేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. నేను స్వతహాగా స్వామివారి భక్తుడనని, ఈయేడాది జాతరను అత్యంత వైభవంగానిర్వహించడానికి ప్రత్యేక శ్రద్ధతో ఈ జాతర కోసం అన్నీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం స్వామివారి కోనేరును సొంత నిధులతో పునఃనిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలియజేశారు. పడమటి అంజన్న జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శనం చేసుకోవాలన్నారు. స్వామివారి కృపా కటాక్షాలు మక్తల్ నియోజకవర్గ ప్రజల మీద, తెలంగాణ ప్రజల మీద ఉండాలని, రాష్ట్ర ప్రజానీకం ఆయురారోగ్యాలతో జీవించాలని మంత్రి ఆకాంక్షించారు.

## విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో పటాన్చెరు ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రైవేట్ పాఠశాలల క్రీడా పోటీలను ఎమ్మెల్యే జిఎంఆర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే మానసిక వికాసం, శారీరక ధారుడ్యం లభిస్తుందని తెలిపారు. ర్యాంకుల మాయలో పడి క్రీడలను నిర్లక్ష్యం చేయవద్దని పాఠశాల యాజమాన్యాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందించడంతో పాటు.. ఆధునిక వసతులతో స్టేడియాలు అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, టిఆర్ఎస్ ఏంఏ రాష్ట్ర కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు సాయి తేజ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఎస్సై మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దూదిమెట్ల సత్తయ్య ఇంటింటి ప్రచారం



**విశ్వంభర, నార్కెట్పల్లి :** నార్కట్ పల్లి మేజర్ గ్రామ పంచాయతీ బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి దూదిమెట్ల సత్తయ్య యాదవ్ మరియు పార్టీ బలపరచిన వార్డు సభ్యులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి మరియు వార్డు మెంబర్ అభ్యర్థుల గుర్తులను ప్రజలకు చూపిస్తూ కేసీఆర్ గారి హయంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గారు ఓటును అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుండి ప్రతీ వర్గానికి అన్యాయం చేసిందని, కాంగ్రెస్ పార్టీ మాయమాటలతో రాష్ట్రంలో గందరగోళం సృష్టిస్తుందని తెలిపారు, కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు, అవగాహనలేమితో రాష్ట్రం అధోగతి పాలైందని ప్రజలకు వివరించారు, కేసీఆర్ గారి బిఆర్ఎస్ పార్టీనే పేద ప్రజలకు అండగా ఉంటుందని, బిఆర్ఎస్ పార్టీ ద్వారానే పట్టణాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని, కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లొంగకుండా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

## గుండెపోటుతో వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతి

### కేటీఆర్ పర్యటనలో వీడియో తీస్తుండగా అస్వస్తత



**విశ్వంభర, హైదరాబాద్ :** వీడియో జర్నలిస్ట్ గా పని చేస్తున్న దామోదర్ గుండెపోటుతో మృతి చెందారు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలో వీడియో తీస్తుండగా ఆయన తీవ్ర అస్వ స్తతకు గురయ్యారు. గమనించిన పోలీసులు వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు దవాఖాన కు తరలించారు. హాస్పిటల్లోని ఐసీయూలో చికిత్స పొందుతూ కొద్ది సేపటిలో మరణించారు. దీంతో ఆయనను గాంధీ దవాఖానకు తరలించారు. దామోదర్ మృతి పట్ల పలువురు జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేసారు.



డిసెంబర్ 8,9 తేదీలల్లో హైదరాబాద్ లో జరిగే గ్లోబల్ సమ్మిట్ కోసం బెంగుళూరుకు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దిరామయ్యను, ఉప ముఖ్యమంత్రి కేపీసీసీ అధ్యక్షులు డీకే శివ కుమార్ ను ఆహ్వానించిన రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

## హిల్ట్ పేరుతో పారిశ్రామిక భూముల బదిలీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ప్రత్యేక పర్యటన




**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా హైదరాబాద్ మహానగర పరిధిలో హిల్ట్‌ప పేరుతో రూ.5 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ యత్నాన్ని అడ్డుకునేందుకు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రత్యేక పర్యటన నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మనిక్రావు, డీసీఎంఎస్ అధ్యక్షుడు మల్కాపురం శివకుమార్, మాజీ బెవరేజెస్ అధికారి దేవి ప్రసాద్, మాజీ ఎస్టీ-ఎస్సీ సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు తమ చేతుల్లో "తెలంగాణను దోచుకుంటున్న దండుపాళ్యం ముఠా" అని రాసిన పలకలు ప్రదర్శిస్తూ, హిల్ట్‌ప విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని నినదించారు. వారి వివరాల ప్రకారం పటాన్‌చెరు ప్రాంతంలో 1,188 ఎకరాలు, పాశమైలారం పారిశ్రామికవాడలో 1,495 ఎకరాలు, మొత్తం 2,708 ఎకరాల పారిశ్రామిక భూమిని హిల్ట్‌ప పేరుతో ప్రైవేటు భూవ్యాపారులకు అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా హిల్ట్‌ప విధానాన్ని తెచ్చిందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద భూకుంభకోణమని పేర్కొన్నారు. పరిశ్రమలను పటాన్‌చెరు-పాశమైలారం నుంచి తరలిస్తే వేలాది మంది కార్మికులు జీవితోపాధి కోల్పోతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం లేని పరిశ్రమలపైనా ప్రభుత్వం బలవంతపు తరలింపులకు సిద్ధమవుతుందంటూ తీవ్ర విమర్శలు చేశారు. హిల్ట్‌ప విధానాన్ని అమలు చేస్తే బీఆర్ఎస్ పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు చేపట్టే తప్ప వేరే మార్గం లేదని హెచ్చరించారు. ప్రభుత్వం ఈ నిర్ణయంపై పట్టుబడితే—ప్రారంభంలో రైతుల నుంచి మూడు వేల రూపాయలకు ఎకరా చొప్పున కొనుగోలు చేసిన భూలోకం కనీసం యాభై శాతం రైతులకే తిరిగి ఇవ్వాలి, కోర్టుల్లో న్యాయం కోసం పోరాడుతున్న రైతుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి, లేదంటే ఆ భూములను ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పూర్తిగా ప్రభుత్వమే అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.